క్లుప్తంగా

బ్రహ్మంగారి ఆలయానికి మైక్‌సెట్ బహూకరణ

చిలుకూరు : చిలుకూరు గ్రామ శివారులోని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి మంగళవారం నల్లబండగూడెం గ్రామానికి చెందిన శ్రీరామానుజ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ పులికొండ మురళీకృష్ణ దంపతులు మైక్‌సెట్ బహూకరించినట్లు ఆలయ పూజారి పమ్మి బ్రహ్మయ్యచారి తెలిపారు. ఆలయ అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

సీఐఎస్‌ఎఫ్ బలగాల కవాతు



సిరికొండలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు, పోలీసులు

మోతె : పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా శాంతిభద్రతల పరిరక్షణకు మోతె మండలంలోని గోల్ తండా, రాంపురంతండా, సిరికొండ గ్రామాల్లో మంగళవారం సూర్యాపేట ఎస్పీ రాహుల్‌హెగ్డే ఆదేశాల మేరకు సీఐఎస్‌ఎఫ్ రక్షణ బలగాలతో పాటు స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోతె ఎస్సై యాదవేందర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బొడ్రాయికి ప్రత్యేక పూజలు



బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న భక్తులు

చిలుకూరు : కొత్త చిలుకూరులో నూతన బొడ్రాయి, ముత్యాలమ్మ విగ్రహాలు ఏర్పాటు చేసి సంవత్సరం పూర్తయిన సందర్భంగా మంగళవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్రాయి, ముత్యాలమ్మ ఆలయాల వద్ద భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

సీతారాంరెడ్డి మృతి పార్టీకి తీరని లోటు



సీతారాంరెడ్డి మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి

నేరేడుచర్ల : సీపీఎం సీనియర్ నేత సీతారాంరెడ్డి అకాల మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పత్తేపురంలో సీతారాంరెడ్డి మృతదేహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట సీపీఎం మండల కార్యదర్శి సిరికొండ శ్రీను, నాగేశ్వర్‌రావు, సైదులు, సోమయ్య, దేవయ్య, రామ నర్సింహారెడ్డి, వెంకటయ్య, నర్సిరెడ్డి, సురేందర్‌రెడ్డి, రాంరెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గడ్డివాము దగ్ధం



మంటలు ఆర్పుతున్న గ్రామస్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపల సింగారం ఆవాస గ్రామం మిట్టగూడెం వద్ద కాలువ కట్టపై రైతు సంగిశెట్టి తిరుపయ్యకు చెందిన 300 కట్టల గడ్డివాము సోమవారం రాత్రి దగ్ధమైంది. అనుమానాస్పదంగా గడ్డివాముకు మంటలు వ్యాపించడంతో గ్రామస్తులు హుజూర్‌నగర్ ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఫైర్ సిబ్బంది వెంటనే వచ్చి మంటలు ఆర్పారు. మంగళవారం కూడా మంటలు రావడంతో గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా ఆర్పారు. గడ్డివాము కాలిపోవడంతో రూ. 50 వేలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపారు.

క్షేత్రపాలకుడికి ఆకుపూజ



ఆకుపూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరగడ్డలో శ్రీశాల్మలీకంద ఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం క్షేత్రపాలకుడికి ఆకుపూజ నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, ఆరాధన, క్షేత్రపాలకుడికి పంచామృతాభిషేకం, ఆకుపూజ, అష్టోత్తర శతనామావళి, సహస్రనామ ఫల పుష్పార్చన, గోత్రనామార్చన, ఆరగింపు, మంగళాశాసనం, పాశుర ఉచ్చరణ, తీర్థ ప్రగోష్టి శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఇన్‌చార్జ్ ఈఓ వెంకటచలపతి, అర్చకులు హరీష్‌కుమార్‌చార్యులు, మనోహరాచార్యులు, ఆలయ సిబ్బంది, కిరణ్‌గౌడ్, గోవిందరెడ్డి, రమేష్, భక్తులు పాల్గొన్నారు.

ప్రాణాలు బలిగొంటున్న క్రాసింగ్‌లు

- నాలుగు నెలల్లో 8 మంది మృతి పలువురికి తీవ్ర గాయాలు
- మునగాలలో అండర్‌పాస్ నిర్మించాలని కోరుతున్న ప్రజలు
- క్రాసింగ్‌ల వద్ద హెచ్చరిక బోర్డులు, సిగ్నల్స్ ఏర్పాటు చేస్తే మేలు



ముకుందాపురం వద్ద సిగ్నల్స్ లేని క్రాసింగ్



మునగాల వద్ద అనధికారికంగా ఏర్పాటు చేసిన క్రాసింగ్

మునగాల : మండల పరిధిలో జాతీయ రహదారిపై ఉన్న క్రాసింగ్‌లు ప్రయాణికుల ప్రాణాలు బలిగొంటున్నాయి. తొమ్మిదవ నెంబర్ జాతీయ రహదారిని నాలుగు లేన్లుగా 65వ నంబర్ హైవేగా మార్చిన జీఎమ్మార్ సంస్థ క్రాసింగ్‌ల ఏర్పాటులో నియమాలు పాటించకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా మండల పరిధిలో 25 కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉన్న ఈ జాతీయ రహదారిపై ఉన్న ఏడు గ్రామాల్లో ఆరు క్రాసింగ్‌లు ఏర్పాటు చేశారు. వీటిలో సగానికి పైగా అనధికారికంగా నిర్మించినవే. ముఖ్యంగా మండల కేంద్రంలో సివిల్ ఆసుపత్రి ఎదురుగా అనధికారికంగా ఉన్న క్రాసింగ్ ప్రమాదకరంగా మారింది. దీంతో ఈ ప్రాంతంలో నెలకు ఐదారు ప్రమాదాలు జరుగుతూ ఉన్నాయి. మండల పరిధిలోని హైవేపై ఉన్న క్రాసింగ్‌ల వద్ద జరిగిన ప్రమాదాల్లో గత జనవరి నుంచి ఇప్పటివరకు నాలుగు నెలల కాలంలో 8 మంది మృత్యువాత పడగా 28 మంది గాయపడ్డారు. ముకుందాపురం వద్ద బస్టాండ్ సెంటర్, హరిజన కాలనీ ఎదురుగా క్రాసింగ్‌ల వద్ద ఎటువంటి సిగ్నల్స్ ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారిపై అతివేగంతో ప్రయాణించే వాహనాలు రోడ్డు దాటుతున్న పాదచారులు, ద్విచక్ర వాహనదారులను ఢీకొడుతుండడంతో వారి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. నిత్యం ప్రమాదాలు జరుగుతుండడంతో హైవేపై ఉన్న గ్రామాల ప్రజలు భయాందోళనల మధ్య కాలం వెళ్లదీస్తున్నారు.

సిగ్నల్స్‌తో ప్రమాదాల నివారణ..

జాతీయ రహదారిపై ఉన్న క్రాసింగ్‌ల వద్ద సిగ్నల్స్, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తే ప్రమాదాలను నివారించే అవకాశం ఉంది. మండల కేంద్రంలో దాదాపు కి.మీ పొడవున ఫ్లై ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేసిన జీఎమ్మార్ సంస్థ కేవలం ఒక అండర్ వెహికల్ పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేయడంతో మండల కేంద్రానికి వచ్చే ఆయా గ్రామాల ప్రజలు తప్పని పరిస్థితుల్లో క్రాసింగ్ దాటి వెళ్లాల్సి వస్తోంది. ఫలితంగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



హైవేపై క్రాసింగ్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. దీంతో ప్రమాదం జరిగినప్పుడు సంబంధిత వాహనం ఆచూకీ దొరుకుతుంది. ప్రమాదాలపై రహదారిపై ఉన్న గ్రామాల ప్రజలను పోలీస్ యంత్రాంగం చైతన్య పరచాలి. రహదారిపై ప్రమాద హెచ్చరిక బోర్డులు, సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి.

– ముస్కుల సైదిరెడ్డి, ముకుందాపురం

మునగాలలో క్రాసింగ్ మూసివేయాలి



మునగాలలో జాతీయ రహదారిపై గల సివిల్ ఆసుపత్రి ఎదురుగా అనధికారికంగా ఏర్పాటు చేసిన క్రాసింగ్ వద్ద నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కావున ఆ క్రాసింగ్‌ను మూసివేయాలి. మండల కేంద్రంలో మరో మినీ వీయూపీ బ్రిడ్జి ఏర్పాటు చేయాలి. డివైడర్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.

– కాసర్ల వెంకట్, మునగాల

లారీ యజమానుల సమస్యలు పరిష్కరిస్తాం

- కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి



కోదాడ: పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

కోదాడ : రాష్ట్రంలో లారీ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, లారీ యజమానులు త్వరలో జరిగే పార్లమెంటు ఎన్నికల్లో నల్గొండ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి కోరారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా జిల్లా లారీ అసోసియేషన్ రూపొందించిన పోస్టర్‌ను మంగళవారం కోదాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దేశంలోనే అత్యధిక మెజార్టీ సాధించే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామినేని శ్రీనివాసరావు, కనగాల నాగేశ్వరరావు, తూనం కృష్ణ, పైడిమర్రి వెంకటనారాయణ, నరసరాజు, నర్సయ్య, నరసింహారావు, గౌసొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి పీఏసీఎస్ చైర్మన్ రాజేష్



నడిగూడెం : ఎమ్మెల్యే పద్మావతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న రాజేష్

నడిగూడెం : కాగితరామచంద్రాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్, చెన్నకేశ్వాపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు గోసుల రాజేష్ మంగళవారం కోదాడలో ఎమ్మెల్యే పద్మావతి సమక్షంలో చేరారు. ఆయనతో పాటు మరో 100 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నడిగూడెం మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు శ్రీను, ప్రధాన కార్యదర్శి వేపూరి సుధీర్, బాణాల నాగరాజు, బోళంల నర్సిరెడ్డి, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

మునగాల : మండలంలోని తాడువాయికి చెందిన బీఆర్‌ఎస్ మండల నాయకుడు, సింగిల్ విండో డైరెక్టర్ గట్టు ఉపేందర్ మంగళవారం రాత్రి కోదాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పద్మావతి సమక్షంలో 20 కుటుంబాలతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ మండల నాయకులు నల్లపాటి శ్రీనివాస్, కొలిశెట్టి బుచ్చిపాపయ్య, ఎలక నరేందర్‌రెడ్డి, మాతంగి బసవయ్య, కొప్పుల జైపాల్‌రెడ్డి, వేనేపల్లి వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి



కోదాడరూరల్ : అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పీవైఎల్ నాయకులు



మునగాల : కొక్కిరేణిలో..

కోదాడరూరల్ : అల్లూరి సీతారామరాజు పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని దేశంలోని దోపిడీ దొంగలను తరిమికొడదామని పీవైఎల్ (ప్రగతి శీల యువజన సంఘం) జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ రవి అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలోని లాల్ బంగ్లాలో అల్లూరి సీతారామరాజు 100వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కులం, మతం, ప్రాంతాల పేరుతో విద్వేషాలు రెచ్చగొడుతున్న మోదీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి, భూక్యా మురళి, సైదులు, రమేష్, సురేష్, విజయ్, హరీష్ తదితరులు ఉన్నారు.

అల్లూరి సీతారామరాజుకు నివాళి

మునగాల : మండలంలోని కొక్కిరేణిలో మంగళవారం అల్లూరి సీతారామరాజు 100 వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ రవి పూలమాల వేసి నివాళులర్పించారు. పీవైఎల్ జిల్లా నాయకులు పొన్నం బ్రహ్మం, సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ నాయకులు బి.సైదా, బి.కోటయ్య, యల్లావుల కళింగరాజు, బూరగొమ్ముల అనిల్ పాల్గొన్నారు.

కార్మికుల ఖాతాల్లో వేతనాలు జమ

నడిగూడెం : మండలంలోని గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు గత కొద్ది నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతుండడంతో మంగళవారం సాక్షి దినపత్రికలో వేతనాలు రాక.. కుటుంబాలు గడవక అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి డీపీఓ సురేష్ స్పందించారు. నడిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి ఆ గ్రామ పంచాయతీ కార్మికులకు ఫిబ్రవరి నెలకు సంబంధించిన వేతనాలను వెంటనే వారి అకౌంట్‌లో జమ చేయించారు. పెండింగ్ వేతనాలు త్వరలోనే జమ చేస్తామని ఆయన సాక్షికి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఎంపీఓ దుర్గాప్రసాద్ ఉన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



నేరేడుచర్ల: కార్డన్ సెర్చ్ అనంతరం మాట్లాడుతున్న సీఐ యలమందరాజు

నేరేడుచర్ల : శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హుజూర్‌నగర్ సీఐ యలమందరాజు అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా మంగళవారం రాత్రి నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్న గ్రామంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో కలిసి స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. అనంతరం గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. గ్రామాల్లో ఎవరైన అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలన్నారు. కాగా, కార్డన్ సెర్చ్‌లో ఎలాంటి పత్రాలు లేని 30 బైక్‌లు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో నేరేడుచర్ల, పాలకీడు, గరిడేపల్లి ఎస్‌ఐలు రవీందర్‌నాయక్, లింగయ్య, సైదులుతో పాటు ఎఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు తదితరులు ఉన్నారు.

కొమరబండలో కార్డన్ సెర్చ్

కోదాడరూరల్ : కోదాడ మండల పరిధిలోని కొమరబండలో రూరల్ సీఐ రజితారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని పలు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సీఐ మాట్లాడుతూ నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నామని తెలిపారు. పార్లమెంటు ఎన్నికలు ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడొద్దని, శాంతిభద్రతలకు భంగం కలిగించవద్దని ప్రజలకు సూచించారు. స్వాధీనం చేసుకున్న వాహనాల పత్రాలు చూపిస్తే తిరిగి ఇస్తామని తెలిపారు. ఈ తనిఖీల్లో ఐదుగురు ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అరుణ్‌కుమార్‌కు పలువురి పరామర్శ



నాగలక్ష్మి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి



నాగలక్ష్మి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, బూరుగడ్డ మాజీ సర్పంచ్ అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్ మాతృమూర్తి నాగలక్ష్మి ఇటీవల మృతి చెందారు. మంగళవారం గ్రామంలో నిర్వహించిన సంతాప సభలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు, హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రాంరెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి అల్లం ప్రభాకర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు ఈడ్పుగంటి సుబ్బారావు, డీసీఎంఎస్ డైరెక్టర్ దొంగరి వెంకటేశ్వర్లు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్, ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, నిజాముద్దీన్, మల్లికార్జునరావు, మంజునాయక్, బార్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే పద్మావతి పరామర్శ

అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్ మాతృమూర్తి నాగలక్ష్మి సంతాప సభలో కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, అరుణ్‌కుమార్‌ను పరామర్శించారు. కాంగ్రెస్ హుజూర్‌నగర్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్‌రావు, రాధిక దేశ్‌ముఖ్, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి

మునగాల : మండలంలోని నర్సింహులగూడెంలో జిల్లా ఎస్పీ రాహుల్‌హెగ్డే ఆదేశాల మేరకు మునగాల పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి పోలీసు కళా బృందం ఎన్నికల నియమావళిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళలు, విద్యార్థుల రక్షణ చట్టాలు, విద్యావిధానాలు, సమస్యలను అధిగమించడం, సోషల్ మీడియా, ఇంటర్నెట్ సద్వినియోగం లాంటి అంశాలపై, విద్యార్థులు ఒత్తిడి అధిగమించి లక్ష్యాలను చేరుకునే విధానాలపై కళాత్మక రూపంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మునగాల ఏఎస్‌ఐ కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. మహిళల రక్షణపై పోలీసు యంత్రాంగం పటిష్టంగా పనిచేస్తుందని తెలిపారు. యువత చెడు వ్యసనాల బారిన పడకుండా తల్లిదండ్రులు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది శివ, కోటేశ్వరరావు, కళాబృందం ఇన్‌చార్జి ఎల్లయ్య, గోపి, కృష్ణాచారి, గురులింగం, గ్రామప్రజలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మునగాల : పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా మునగాల మండలంలో ఏర్పాటు చేసిన పలు పోలింగ్ కేంద్రాలను మంగళవారం తహసీల్దార్ వలిగొండ ఆంజనేయులు, ఆర్‌ఐ ఎన్.రామారావు పరిశీలించారు. నర్సింహాపురంలోని పోలింగ్ కేంద్రంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పంచాయతీ కార్యదర్శి పచ్చిపాల వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు.

హుజూర్‌నగర్‌లో వర్షం

హుజూర్‌నగర్ : పట్టణంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడటంతో ఇన్నాళ్లు ఎండలకు అల్లాడిన ప్రజలు ఒకింత సేదదీరారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పట్టణంలో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

రేవూరులో నెలకొరిగిన అరటి

మేళ్లచెరువు : మండలంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపుల తోతోతో కూడిన వానజల్లు పడింది. రేవూరులో ఈదురుగాలులకు కాపు దశలో ఉన్న రెండు ఎకరాల అరటి తోట నెలకొరిగింది. దీంతో ఎకరాకు లక్ష రూపాయల మేర నష్టం వాటిల్లినట్లు రైతు తమ్మారెడ్డి అఖిల్ చౌదరి తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

వాతావరణ మార్పులపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ చక్రవర్తి



మాట్లాడుతున్న డాక్టర్ కళ్యాణ చక్రవర్తి

చిలుకూరు : వాతావరణంలో వచ్చే మార్పుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ చక్రవర్తి సూచించారు. మంగళవారం చిలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 సంవత్సరాలు దాటిన మహిళలు సర్వైకల్ క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ విషయంపై మహిళలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఆరోగ్య సిబ్బందిపై ఉందన్నారు. గ్రామాల్లో సాధారణ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆశాలకు సూచించారు. వడదెబ్బకు ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు తెలియజేయాలన్నారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, లక్ష్మీప్రసన్న, దీక్ష, జోష్న, స్వాతి, సావిత్రి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థి కృష్ణారెడ్డిని గెలిపించాలి




హుజూర్‌నగర్‌లో మహిళను ఓటు అభ్యర్థిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సతీమణి రమాదేవి

హుజూర్‌నగర్ : కరెంటు కోతలతో ప్రజలను ఇబ్బంది పెడుతున్న కాంగ్రెస్ పార్టీని పార్లమెంటు ఎన్నికల్లో ఓడించాలని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సతీమణి కంచర్ల రమాదేవి అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని 17, 22వ వార్డుల్లో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరారు. ఆమె వెంట జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, జక్కుల నాగేశ్వరరావు, బెల్లంకొండ అమర్, రంగాచారి, నగేష్ రాథోడ్, ములకలపల్లి రాంగోపి, కోలా శ్రీనివాస్, పచ్చిపాల ఉపేందర్, చంద్రమౌళి, రత్నశ్రీ, పుష్ప, బానోవత్ వెంకటేశ్వర్లు, భిక్షం, సాయిరాం, రవీందర్, హరికృష్ణ, నరసింహారావు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.


బీఆర్‌ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం

హుజూర్‌నగర్‌రూరల్ : బీఆర్‌ఎస్ పార్టీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మండలంలోని గోపాలపురంలో జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీ చీకూరి రాజారావు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు షేక్ జానిమియా, మండల యూత్ అధ్యక్షుడు వీరమళ్ల సుందరయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు ప్రచారం



నేరేడుచర్ల : ఎన్‌టీఆర్ నగర్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



హుజూర్‌నగర్‌రూరల్ : బూరుగడ్డలో ప్రచారంలో భాగంగా దోశలు వేస్తున్న ఎంపీపీ శ్రీనివాస్

చిలుకూరు : కాంగ్రెస్ పార్టీ నల్గొండ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రంతో పాటు సీతారాంపురం, ఆర్లెగూడెంలో కాంగ్రెస్, సీపీఐ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కీత వెంకటేశ్వర్లు, పిండ్రాతి హనుమంతరావు, ఎంపీపీ బండ్ల ప్రశాంతి కోటయ్య, జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీష నాగేంద్రబాబు, మాజీ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని 5, 6, 15వ వార్డుల్లో ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు, సీపీఐ నేత ధనుంజయ నాయుడు, కౌన్సిలర్ రణపంగ నాగయ్య, ఇండియా కూటమి నాయకులు ఆకారపు వెంకటేశ్వర్లు, తాళ్ల సురేష్‌రెడ్డి, పోరెడ్డి లింగారెడ్డి, కృష్ణమూర్తి ఉన్నారు.

మునగాల : పార్లమెంటు ఎన్నికల్లో రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ కొక్కిరేణి, తిమ్మారెడ్డిగూడెం, గణపవరం గ్రామాల్లో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు తిమ్మారెడ్డి వీరరాఘవరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు పోటు అశోక్‌కుమార్, బూసిపల్లి శ్రీనివాసరెడ్డి, తిమ్మారెడ్డి వీరరాఘవరెడ్డి, భూసిపల్లి శ్యామ్, సారెడ్డి సైదిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు అత్యధిక మెజార్టీ తేవాలి

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి అత్యధిక మెజార్టీ తీసుకురావాలని కాంగ్రెస్, సీపీఎం పార్టీల సీనియర్ నాయకులు నల్లపాటి శ్రీనివాస్, బుర్రి శ్రీరాములు కోరారు. మంగళవారం సీతానగరం, విజయరాఘవపురం, కలకోవ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు కొలిశెట్టి బుచ్చిపాపయ్య, దేవినేని రవి, కాసర్ల శ్రీనివాస్, జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

దోశలు వేసి.. ఓట్లు అడిగి

హుజూర్‌నగర్‌రూరల్ : కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ బూరుగడ్డ, మాచవరంలో ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ఎంపీపీ ఓ హోటల్‌లో దోశలు వేసి ఓటర్లకు పంపిణీ చేశారు. పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు యరగాని భిక్షం, నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

మోతె : మండలంలోని కూడలి, గోల్‌తండా, బుర్కచర్లలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేశారు.

కాంగ్రెస్, సీపీఐల ఆధ్వర్యంలో..

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని లక్కవరంలో కాంగ్రెస్, సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ చామకూరి గురుపాదం, చామకూరి మధు, సైదులు, రామయ్య, జార్జీ, సర్వయ్య, కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి

గరిడేపల్లి : రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రంగనాథ్ కోరారు. మంగళవారం గుండాల మిట్టలో ప్రచారం నిర్వహించారు. సింగిల్ విండో మాజీ చైర్మన్ బండ నర్సిరెడ్డి, మేకపోతుల అఖిల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మఠంపల్లి : మండల కేంద్రంతో పాటు పెదవీడు, చెన్నాయిపాలెం తదితర గ్రామాల్లో రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ మంగళవారం కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచ్‌లు ఆదూరి స్రవంతికిషోర్‌రెడ్డి, కొత్తపల్లి కృపానందం, కర్నె రమణావెంకటేశ్వర్లు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ దైదా రాయలు, శౌరి, చంద్రయ్య, వెంకటేశ్వర్లు, దగ్గుబాటి రత్నం, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పాలకవీడు : మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీపీ భూక్యా గోపాల్, జెడ్పీటీసీ మాళోతు బుజ్జిమోతీలాల్, సీపీఎం మండల కార్యదర్శి అనంతప్రకాష్‌తో కలిసి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్వి.సుబ్బారావు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బెల్లంకొండ నరసింహారావు, వైస్ ఎంపీపీ ఉపేందర్‌రావు, అందె రాజు పాల్గొన్నారు.

కూలిన కోళ్ల ఫాం



గారకుంటతండాలో నేలకూలిన కోళ్లఫాం షెడ్

గరిడేపల్లి : గత రెండు రోజులుగా వీస్తున్న ఈదురుగాలులకు గరిడేపల్లి మండలంలోని గారకుంటతండాలో గుగులోతు నాగునాయక్‌కు చెందిన కోళ్ల ఫాం షెడ్ నేలకూలింది. దీంతో సుమారు రూ.లక్ష 20 వేలు ఆస్తినష్టం జరిగిందని బాధితుడు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం అర్చకులు వేదమంత్రాలతో నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తిగావించి శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా ముస్తాబుచేసి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం రక్తిగట్టించారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, ఋత్విగ్వరణం, పంచగవ్యప్రాశన , మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు ముగించారు. శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయ ప్రవేశం గావించి నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదనచేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకులతో ప్రత్యేకార్చనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు తూమాటి క్రిష్ణమాచార్యులు, పద్మనాభా చార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహ మూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.